తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శనివారం - 18- జూలై 2026 | సంపుటి : 4 | సంచిక : 44 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in



# ఎల్‌నినోపై అప్రమత్తమైన ప్రభుత్వం

- వర్షా భావ పరిస్థితులపై మంత్రివర్గం ఆందోళన
- తాగునీరు, సాగునీటికి ప్రత్యేక కార్యాచరణ
- ధరణి అక్రమాలపై ప్రత్యేక విచారణ బృందం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన
- రాష్ట్ర మంత్రిమండలి సమావేశం



2లో

# ప్రభుత్వ ఉద్యోగులకు ఆరోగ్య భరోసా



**న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ప్రారంభం**
**8 లక్షల మందికి నగదు రహిత వైద్యం**
**1,816 రకాల చికిత్సలకు వర్తింపు**
**రూ.10 వేల కోట్ల పెండింగ్ బిల్లుల చెల్లింపు**

**సహైదరాబాద్, జూలై 17 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సమగ్ర ఆరోగ్య భద్రత కల్పించే లక్ష్యంతో 'న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్'ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు ఆరోగ్య కార్డులను పంపిణీ చేశారు. ఈ పథకం ద్వారా సుమారు 8 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారిపై ఆధారపడిన 29.80 లక్షల మంది కుటుంబ సభ్యులు సంపూర్ణ నగదు రహిత వైద్య సేవలను పొందనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు అనారోగ్యానికి గురైనప్పుడు వైద్య ఖర్చుల భారం కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా చేయడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఉద్యోగుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి

మిగతా 2లో





# నగర భద్రతపై డీజీపీ సమీక్ష

- డీజీపీ సీవీ ఆనంద్ కీలక ఆదేశాలు
- సేఫ్ సిటీ పనుల వేగంపై దృష్టి

**హైదరాబాద్, జూలై 17 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ సేఫ్ సిటీ ప్రాజెక్టు కింద అమలవుతున్న వివిధ కార్యక్రమాల పురోగతిపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. నగర భద్రత, మహిళల రక్షణ, రవాణా నిర్వహణ, పురపాలక సంస్థలతో పాటు సంబంధిత శాఖల అధికారులతో సమావేశమైన ఆయన వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్‌కు అనుగుణంగా భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు.

మిగతా 2లో

# దేశానికి తొలి హైడ్రోజన్ రైలు

- పచ్చదనానికి కొత్త దిశ
- స్వదేశీ సాంకేతికతతో ఘన విజయం
- జింద్–సోనిపట్ మధ్య సేవలు
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

**హర్యానా, జూలై 17 (తెలంగాణ ముచ్చట్లు):**

దేశంలోనే మొట్టమొదటి హైడ్రోజన్ ఇంధనంతో నడిచే రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం హర్యానాలో జెండా ఊపి ప్రారంభించారు. జింద్-సోనిపట్ మధ్య 89 కిలోమీటర్ల మార్గంలో ఈ రైలు సేవలు అందించనుంది. పర్యావరణ పరిరక్షణకు, హరిత రవాణా వ్యవస్థ అభివృద్ధికి ఇది చారిత్రాత్మక ముందడుగుగా ప్రధానమంత్రి అభివర్ణించారు.

మిగతా 2లో



# గురుకుల విద్యార్థినికి ఘన సత్కారం

**స్వర్ణ విజేత ప్రవళికకు అభినందనలు**
**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సన్మానం**
**క్రీడలకు ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహం**

**హైదరాబాద్, జూలై 17 (తెలంగాణ ముచ్చట్లు):**


చైనాలోని ఓర్డోస్‌లో జరిగిన తొలి ఆసియా అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్–2026లో మహిళల 4×400 మీటర్ల రిలే పోటీలో భారత జట్టు తరపున స్వర్ణ పతకం సాధించిన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల క్రీడా అకాడమీ విద్యార్థిని నారిమల్ల ప్రవళికను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ఘనంగా సన్మానించారు.

మిగతా 7లో



# దేవాదాయ శాఖలో చారిత్రక నియామకాలు

**రవీంద్రభారతిలో నియామక పత్రాల పంపిణీ**
**191 మందికి ఉద్యోగాల కల్పన**
**మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా ఉత్తర్వులు**



**హైదరాబాద్, జూలై 17 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ దేవాదాయ శాఖ చరిత్రలో తొలిసారిగా భారీ స్థాయిలో 191 మంది మతపరమైన ఉద్యోగులకు నియామక ఉత్తర్వులను రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో అందజేశారు. పురోహితులు, పరిచారకులు, వేదపండితులు, వాహన పూజ పురోహితులు, సహాయ వంట సిబ్బంది, డోలు, సన్నాయి, మృదంగం, శృతి, తాళం తదితర విభాగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ప్రత్యేక తెలంగాణ చరిత్రలో దేవాదాయ శాఖలో ఇంత పెద్దఎత్తున మతపరమైన ఉద్యోగాల భర్తీ జరగడం ఇదే తొలిసారని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ దేవాలయ సేవను కేవలం ఉద్యోగంగా కాకుండా భగవంతుని సేవ చేసే పవిత్ర బాధ్యతగా భావించాలని నూతన ఉద్యోగులకు

మిగతా 7లో

# హైటెక్ సిటీ స్టేషన్‌కు ఆధునిక హంగులు

- అమృత్ భారత్ పథకంలో పునర్వికాసం
- ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు
- హైదరాబాద్ అభివృద్ధికి మరో ముందడుగు



**హైదరాబాద్, జూలై 17 (తెలంగాణ ముచ్చట్లు):**

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఆధునికీకరించిన హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువస్తుందని తెలంగాణ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తెలిపారు. భారతీయ రైల్వేల అభివృద్ధిలో ఈ స్టేషన్ పునర్వికాసం మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతీయ రైల్వేలు అపూర్వమైన వేగంతో అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు.

మిగతా 2లో

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# ఎల్‌నినోపై అప్రమత్తమైన ప్రభుత్వం

హైదరాబాద్, జూలై 17 (తెలంగాణ ముచ్చట్లు):

ఎల్‌నినో ప్రభావం, రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పరిస్థితుల తీవ్రతను కేంద్ర ప్రభుత్వానికి వివరించి ప్రత్యేక సహాయం కోరాలని నిర్ణయించింది. వర్షాభావం వల్ల కలిగిన నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్ర బృందాన్ని రాష్ట్రానికి పంపించాలని, ప్రత్యామ్నాయ ప్రణాళికల అమలుకు అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ కేంద్రానికి లేఖ రాయాలని మంత్రివర్గం తీర్మానించింది. రాష్ట్రంలో తాగునీరు, సాగునీరు, విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రివర్గం ఆదేశించింది. ప్రస్తుతం రాష్ట్రంలోని ఏ ప్రాంతంలోనూ సాధారణ వర్షపాతం నమోదు కాలేదని, చాలా చోట్ల 30 నుంచి 35 శాతానికి మించి వర్షపాతం లేకపోవడంతో ముందస్తు కార్యాచరణను సిద్ధం చేయాలని సూచించింది. ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యంగా వినియోగించాలని, రైతులు తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని విజ్ఞప్తి చేసింది.

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రజలకు అవసరమైన సమాచారం, సలహాలు అందించేందుకు ప్రజాభవన్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో టోల్‌ఫ్రీ సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేసే ఈ హెల్ప్‌లైన్‌కు 18001237157 నంబర్‌ను అందుబాటులో ఉంచింది. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై జిల్లా కలెక్టర్లు వెంటనే స్పందించాలని, తాగునీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. వర్షాభావ పరిస్థితులపై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ నెల 20న ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రులు, సీనియర్ ఐఏఎస్ అధికారుల ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు, నిపుణులు, శాస్త్రవేత్తలతో సమావేశాలు నిర్వహించి జిల్లాల వారీగా పరిస్థితులు, పంట నష్టాలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని నిర్ణయించింది. అలాగే రాష్ట్ర ప్రణాళిక మండలి ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయ నిపుణులతో ఎల్‌నినో ప్రభావంపై ప్రత్యేక అధ్యయన నివేదిక రూపొందించాలని సూచించింది.

మంత్రిమండలి సమావేశంలో ధరణి పోర్టల్‌కు సంబంధించిన అక్రమాలు, అవకతవకలపై సమగ్ర విచారణ జరిపేందుకు ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ధరణి టెండర్ ప్రక్రియ నుంచి ప్రారంభించి, 2020 అక్టోబర్ 29 నుంచి ఇప్పటి వరకు జరిగిన భూముల రిజిస్ట్రేషన్లు, రికార్డుల మార్పులు, వ్యవసాయ, అసైన్డ్, ప్రభుత్వ భూముల బదలాయింపులు సహా అన్ని అనుమానాస్పద లావాదేవీలను లోతుగా విచారించాలని నిర్ణయించినట్లు మంత్రులు వెల్లడించారు. సామాజిక, పరిపాలనా సంస్కరణలకు సంబంధించిన పలు కీలక నిర్ణయాలకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లను సహనియమిత సభ్యులుగా నామినేట్ చేసేలా తెలంగాణ మున్సిపాలిటీల చట్టం-2019లో సవరణకు, గ్రామ పంచాయతీ నిధులను జాతీయ బ్యాంకులు, సహకార బ్యాంకులు లేదా పోస్టాఫీసుల్లో జమ చేసుకునేలా తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018లో సవరణకు ఆమోదం తెలిపింది. సమావేశం అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంత్రివర్గ నిర్ణయాలను మీడియాకు వివరించారు.

# నగర భద్రతపై డీజీపీ సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)



సాంకేతికత ఆధారిత పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అధిక నాణ్యత గల నిఘా కెమెరాల వినియోగాన్ని మరింత విస్తరించడంతో పాటు అన్ని పోలీస్ కమిషనరేట్లలో సమీకృత నియంత్రణ, కమాండ్ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని డీజీపీ సూచించారు. కృత్రిమ మేధస్సు ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థలు, తెలివైన రవాణా నిర్వహణ విధానాలను అమలు చేయడం ద్వారా నేరాల నియంత్రణతో పాటు అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందన అందించవచ్చని తెలిపారు. సేఫ్ సిటీ ప్రాజెక్టు కింద నాలుగు పోలీస్ కమిషనరేట్ల పరిధిలో ఇప్పటికే 2,306 నిఘా కెమెరాలు పనిచేస్తుండగా, మరో 862 కెమెరాల ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయని సమావేశంలో వెల్లడించారు. నగరంలోని కీలక ప్రాంతాల్లో నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసి ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించాలని డీజీపీ ఆదేశించారు. మహిళల భద్రతను మరింత మెరుగుపరిచే చర్యల్లో భాగంగా మరో 12 చరవాణి మహిళల మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. అలాగే పనిచేయని 404 ట్రాఫిక్ సిగ్నళ్లను తక్షణమే పునరుద్ధరించాలని, పాదచారులకు అనుకూలమైన మౌలిక సదుపాయాలను మరింత అభివృద్ధి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక రవాణా నిర్వహణ చర్యలు చేపట్టడంతో పాటు ప్రజల్లో రహదారి భద్రత, మహిళల రక్షణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీజీపీ ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి సేఫ్ సిటీ ప్రాజెక్టు లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌ను దేశంలోనే అత్యంత సురక్షిత మహానగరాల్లో ఒకటిగా మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఆధునిక సాంకేతికత, సమర్థవంతమైన పోలీసింగ్, ప్రజల భాగస్వామ్యంతో నేరాల నియంత్రణ, అత్యవసర సేవల మెరుగుదల, జీవన ప్రమాణాల పెంపు సాధ్యమవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# హైటెక్ సిటీ స్టేషన్‌కు ఆధునిక హంగులు

(మొదటి పేజీ తరువాయి)



దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ, మౌలిక సదుపాయాల విస్తరణ, ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. హైటెక్ సిటీ అమృత్ భారత్ రైల్వే స్టేషన్‌లో ఆధునిక ప్రయాణికుల సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో రోజువారీ ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవం లభిస్తుందని రాంచందర్ రావు తెలిపారు. పెరుగుతున్న నగర అవసరాలకు అనుగుణంగా స్టేషన్‌ను అభివృద్ధి చేయడం ద్వారా రవాణా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని అన్నారు.

హైదరాబాద్ నగరం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ఆధునిక రైల్వే మౌలిక సదుపాయాలు నగరాభివృద్ధికి కీలకంగా మారాయని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన రవాణా సేవలు అందించడంతో పాటు నగర ఆర్థికాభివృద్ధికి కూడా ఈ ప్రాజెక్టులు దోహదపడతాయని వివరించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం ద్వారా దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్లను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తూ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన అన్నారు. ఆధునిక సాంకేతికతతో కూడిన మౌలిక వసతులు భారతీయ రైల్వేలను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుతున్నాయని పేర్కొన్నారు.

హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ పునర్వికాసంతో హైదరాబాద్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో ముందడుగు పడిందని రాంచందర్ రావు అభిప్రాయపడ్డారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేపడుతున్న ఇలాంటి ప్రాజెక్టులు నగర ప్రజలకు మరింత మెరుగైన రవాణా సౌకర్యాలను అందించనున్నాయని తెలిపారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు ఆరోగ్య భరోసా

(మొదటి పేజీ తరువాయి)

ఈ పథకం నిదర్శనమని పేర్కొన్నారు. మానవీయ దృక్పథంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మంత్రివర్గ ఉపసంఘం సిఫారసుల మేరకు ఈ పథకాన్ని రూపొందించినట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 886 గుర్తింపు పొందిన ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉద్యోగులు, పెన్షనర్లు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా ఆస్పత్రిలో చేరి చికిత్స పొందే అవకాశం ఈ పథకం ద్వారా లభించనుంది. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం ప్యాకేజీలకు అనుగుణంగా 1,816 రకాల వైద్య, శస్త్రచికిత్సలను ఇందులో చేర్చినట్లు తెలిపారు. పథకం అమలును పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వ అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక ట్రస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న దాదాపు రూ.10 వేల కోట్ల వైద్య బిల్లులను తమ ప్రభుత్వం దశలవారీగా చెల్లిస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రతి నెలా సుమారు రూ.2 వేల కోట్ల చొప్పున బిల్లులను విడుదల చేస్తూ, ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉద్యోగులకు సంబంధించిన ఒక్క రూపాయి కూడా బకాయి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఆరోగ్య భద్రత విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి అర్హులైన కోట్లాది కుటుంబాలకు కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తున్నామని గుర్తు చేశారు. ఉద్యోగులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేసే వారధులుగా పనిచేయాలని, మరింత నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వైద్య ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చోంగ్తూ, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, సాధారణ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బెన్ హర్ మహేష్ దత్ ఎక్కా, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఉద్యోగ సంఘాల నాయకులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




# నర్సింగ్ అధికారులకు నియామక పత్రాలు

- భట్టి విక్రమార్క చేతుల మీదుగా పంపిణీ
- 247 మందికి ఉద్యోగాల కల్పన

హైదరాబాద్, జూలై 17 (తెలంగాణ ముచ్చట్లు):

ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఎంపికైన 247 మంది నర్సింగ్ అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి శుక్రవారం సేవాలాల్ భవన్‌లో నియామక పత్రాలను అందజేశారు. ప్రభుత్వ నియామక ప్రక్రియలో భాగంగా ఎంపికైన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో తమ బాధ్యతను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ వైద్యం, విద్యపై ప్రభుత్వం చేస్తున్న వ్యయం కేవలం ఉచిత సంక్షేమ కార్యక్రమం మాత్రమే కాదని, రాష్ట్ర భవిష్యత్తును నిర్మించే మానవ వనరులపై పెట్టుబడిగా ప్రభుత్వం భావిస్తోందని పేర్కొన్నారు. ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

ప్రజా ప్రభుత్వం పారదర్శక విధానంలో ఇప్పటికే 76 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించిందని భట్టి విక్రమార్క తెలిపారు. అర్హత, ప్రతిభ ఆధారంగానే నియామకాలు చేపడుతున్నామని, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్య సేవలను మరింత విస్తరించేందుకు ఈఎస్ఐ ఆసుపత్రులతో పాటు ఇతర వైద్య మౌలిక సదుపాయాలను కూడా ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి వివరించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన సిబ్బంది నియామకంతో పాటు ఆధునిక సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

నియామక పత్రాలు అందుకున్న నూతన నర్సింగ్ అధికారులందరికీ భట్టి విక్రమార్క హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని మరింత పెంచాలని ఆకాంక్షించారు. ప్రతి రోగికి మానవతా దృక్పథంతో సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ శాఖ అధికారులు, వైద్యాధికారులు, నూతనంగా ఎంపికైన నర్సింగ్ అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో ఈ నియామకాలు కీలకమని అధికారులు పేర్కొన్నారు.




# దేశానికి తొలి హైడ్రోజన్ రైలు

(మొదటి పేజీ తరువాయి)

స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో ఈ రైలును రూపొందించడం దేశ గర్వకారణమని, ఆధునిక రైల్వే రంగంలో భారత్ సామర్థ్యానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ సాంకేతికతతో ఈ రైలు పూర్తిగా పనిచేస్తుంది. బొగ్గు, డీజిల్ వంటి సంప్రదాయ ఇంధనాల అవసరం లేకుండా హైడ్రోజన్‌ను విద్యుత్తుగా మార్చి ఇంజిన్‌కు శక్తిని అందిస్తుంది. ఈ ప్రక్రియలో ఉప ఉత్పత్తిగా కేవలం నీటి ఆవిరి మాత్రమే విడుదల అవుతుంది. అందువల్ల కార్బన్ ఉద్గారాలు పూర్తిగా శూన్యంగా ఉండటంతో పర్యావరణానికి ఎలాంటి హాని కలగదు. భవిష్యత్తులో హరిత రవాణా వ్యవస్థకు ఈ సాంకేతికత కీలకంగా మారనుందని రైల్వే అధికారులు తెలిపారు.

'నమో గ్రీన్ రైలు' పేరుతో ప్రారంభమైన ఈ రైలుకు 10 బోగీలు, 3200 హార్స్‌పవర్ సామర్థ్యం కలిగిన ఇంజిన్ అమర్చారు. గంటకు సుమారు 110 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఈ రైలులో ఒకేసారి దాదాపు 2,600 మంది ప్రయాణికులు ప్రయాణించే వీలుంది. ప్రయాణికుల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక సదుపాయాలతో ఈ రైలును రూపొందించారు. దేశీయ సాంకేతిక నైపుణ్యంతో నిర్మించడం భారత ఇంజినీరింగ్ ప్రతిభను ప్రపంచానికి చాటే ఘట్టంగా నిలిచింది. ఈ రైలును చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో పూర్తిగా స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేశారు. హైడ్రోజన్ నిల్వ వ్యవస్థ, ఇంధన కణాల సాంకేతికత, విద్యుత్ నియంత్రణ వ్యవస్థలను భారత ఇంజినీర్లు విజయవంతంగా సమన్వయం చేశారు. ప్రత్యామ్నాయ ఇంధన వినియోగాన్ని ప్రోత్సహిస్తూ రైల్వే వ్యవస్థను పర్యావరణహితంగా మార్చాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యంలో ఈ ప్రాజెక్టు కీలక మైలురాయిగా నిలిచింది.

ప్రపంచంలో హైడ్రోజన్ ఆధారిత రైళ్లను తొలిసారిగా జర్మనీ ప్రవేశపెట్టింది. అనంతరం జపాన్, చైనా, అమెరికా తదితర దేశాలు కూడా ఈ సాంకేతికతను వినియోగంలోకి తీసుకొచ్చాయి. ఇప్పుడు భారత్ కూడా ఆ దేశాల సరసన చేరడం ద్వారా హరిత రవాణా రంగంలో తన సత్తాను మరోసారి నిరూపించుకుంది. రానున్న రోజుల్లో మరిన్ని మార్గాల్లో హైడ్రోజన్ రైళ్లను ప్రవేశపెట్టేందుకు భారత రైల్వేలు కార్యాచరణ సిద్ధం చేస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణతో పాటు ఇంధన దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం, స్వచ్ఛమైన రవాణా వ్యవస్థను ప్రజలకు అందించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యంగా ఉంది. కార్బన్ ఉద్గారాల నియంత్రణ, పరిశుభ్రమైన ఇంధన వినియోగం, స్వదేశీ సాంకేతిక అభివృద్ధి వంటి అంశాల్లో ఈ హైడ్రోజన్ రైలు దేశానికి కొత్త దిశను చూపనుంది. భారత రైల్వే చరిత్రలో ఈ ప్రాజెక్టు మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# మసూద్ మృతి పార్టీకి తీరని లోటు



- ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి ఆవేదన
- కొత్తగూడెంలో పలు కుటుంబాలకు పరామర్శ

**ఖమ్మం బ్యూరో, జులై 17(తెలంగాణ ముచ్చట్లు ):** మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ నాయకులు మసూద్ మరణం పార్టీకి, మైనారిటీ వర్గాలకు తీరని లోటు అని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. ఇటీవల ఎస్ కే. మసూద్ గుండె పోటుతో మరణించారు. ఈ రోజు వారి స్వగృహానికి వెళ్ళి మసూద్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మసూద్ సతీమణి 54వ డివిజన్ కార్పొరేటర్ నళినీ జయంతి మసూద్ మరియు కుటుంబ సభ్యులను కలిసి తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మసూద్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ మసూద్ మరణం పార్టీకి, మైనారిటీ వర్గాలకు తీరని లోటు అని, మసూద్ దంపతులు ప్రజలకు చేసిన సేవలు మరువలేవని, మైనారిటీ వర్గాల కబరస్థాన్ స్థలం కోసం పోరాడిన వ్యక్తి అని కొనియాడారు.

అనంతరం అనారోగ్యానికి గురైన కాంగ్రెస్ నాయకులు సురేష్ ను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రామవరంలో కరెంట్ షాక్ తో మరణించిన కాంగ్రెస్ యువ నాయకులు కళ్యాణ్ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. బాబు క్యాంప్ నకు చెందిన అడేపు విజయ లక్ష్మీ కుటుంబాన్ని పరామర్శించారు. నివాళులు అర్పించారు. కాంగ్రెస్ నాయకుల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దేవి ప్రసన్న, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత, రాష్ట్ర నాయకులు ఆళ్ల మురళి, కొత్వాల శ్రీనివాస రావు, మాజీ జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్ర శేఖర్ రావు, జిల్లా అధికార ప్రతినిధి వై. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ జానీ పాషా, మంద హనుమంత రావు, కొదుమూరి శ్రీనివాస్ రావు, జిల్లా జనరల్ సెక్రటరీ లు పెద్ద బాబు, నాగార్జున, సొసైటీ చైర్మన్ మండే హనుమంతరావు, ఐఎన్ టీఎంసీ నేత రజాక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, పట్టణ, మండల కాగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్ యాదవ్, దేవగడ్ల ప్రసాద్, జేమ్స్ సునీల్, భువన సుందర్ రెడ్డి, చింతలపూడి రాజ శేఖర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు గడ్డల రమేష్, కార్పొరేటర్లు, సర్పంచ్ లు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# స్మార్ట్ కిడ్జ్ లో మొక్కలు నాటిన చిట్టి చేతులు

- నేడు చెట్టు నాటుదాం ..
- రేపటి కోసం పచ్చని భవిష్యత్తుని నిర్మిద్దాం..!!
- అంటూ నినదించిన స్మార్ట్ కిడ్జ్ చిన్నారులు.
- హాజరైన కార్పొరేషన్ హార్టికల్చర్ అధికారి రాధిక




**ఖమ్మం బ్యూరో,జూలై 17(తెలంగాణ ముచ్చట్లు ):** స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాల ఆవరణం శుక్రవారం చిట్టి చేతుల వన మహోత్సవ సంబరంలో మురిసిపోయింది. చిన్నారులు వనమహోత్సవ వేడుకను ఆనందోత్సవాలతో నిర్వహించారు. పాఠశాల చిన్నారులు పాఠశాల మైదానంలో, రహదారులకు ఇరు వైపులా పలు రకాల మొక్కలను నాటారు. నీడనిచ్చే మొక్కలు, పండ్ల మొక్కలు, అందంగా పూలతో ఉండే మొక్కలు, తదితర వివిధ రకాల మొక్కలను నగరంలోని వేరువేరు ప్రాంతాలలో నాటారు. మొక్కలతో నగరంలో పాఠశాల విద్యార్థులు వనమహోత్సవ చైతన్య ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి ప్రారంభమైన విద్యార్థులు ర్యాలీ నగరంలోని ప్రధాన రహదారుల గుండా నిర్వహించి ప్రజలను వనమహోత్సవం గురించి చైతన్యపరిచారు. పాఠశాలలో మొక్కల ప్రయోజనాలను వివరిస్తూ ఇద్దరు విద్యార్థులు ప్రదర్శించిన లఘు నాటిక అందరిని ఆలోచింపజేసింది. పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య వనమహోత్సవ ర్యాలీని ప్రారంభించగా ఖమ్మం కార్పొరేషన్ హార్టికల్చర్ అధికారిని రాధిక ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ హార్టికల్చర్ అధికారిని రాధిక మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సంకల్పంతో నిర్వహించాలని కోరారు. మొక్కలు పెంచడం ద్వారా మనకు దీర్ఘకాలంగా ప్రాణవాయువు లభిస్తుందని పేర్కొన్నారు. స్మార్ట్ కిడ్జ్ చిన్నారులు వనమహోత్సవాన్ని వేడుకోగా నిర్వహించడం ద్వారా ఇతర పాఠశాలల విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ తమ పాఠశాల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం సామాజిక బాధ్యతతో నిర్వహిస్తున్నామని, ఈ ప్రాంతంలోని పెరిగిన చెట్లు తమ పాఠశాల విద్యార్థులు గతంలో నాటిన మొక్కల వల్లనే ప్రయోజనం జరిగిందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తమ ఇంటి ముందు తమ పుట్టినరోజున తప్పనిసరిగా మొక్కలు నాటి పెంచాలని కోరారు. అనంతరం విద్యార్థులందరికీ మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులుపాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎంపీలు రేణుకా చౌదరి, రామసహాయం రఘురాం రెడ్డి



**ఖమ్మం బ్యూరో, జులై 17(తెలంగాణ ముచ్చట్లు) :** అనారోగ్యంతో బాధపడుతూ ప్రయివేట్, కార్పొరేట్ ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజురైన చెక్కులను రాజ్యసభ సభ్యురాలు, రేణుకా చౌదరి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి పంపిణీ చేశారు. చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలోని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లా క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సీఎం ఆర్ ఎఫ్ చెక్కులు బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇప్పటివరకు కొత్తగూడెం నియోజకవర్గంలో ఈ రెండున్నర సంవత్సర కాలంలో 269 పై చిలుకు మందికి చెక్కుల రూపంలో అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమాలలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దేవి ప్రసన్న, దేవి ప్రసన్న, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, గ్రంథాలయ చైర్మన్ వీరబాబు, రాష్ట్ర నాయకులు ఆళ్ల మురళి, కొత్వాల శ్రీనివార్ రావు, మాజీ జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్ర శేఖర్ రావు, జిల్లా అదిరికార ప్రతినిధి వై శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వైస్ ప్రెసిడేట్ జానీ పాషా, మంద హనుమంత రావు, కొదుమూరి శ్రీనివాస్ రావు, జిల్లా జనరల్ సెక్రటరీ లు ఏం పెద్ద బాబు, నాగార్జున, సొసైటీ చైర్మన్ మండే హనుమంతరావు, ఐఎన్ టీఎంసీ రజాక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, పట్టణ, మండల కాగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్యాదవ్, దేవగడ్ల ప్రసాద్, జేమ్స్ సునీల్, భువన సుందర్ రెడ్డి, చింతలపూడి రాజ శేఖర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు గడ్డల రమేష్, కార్పొరేటర్లు, సర్పంచ్ లు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఏనుగుల అర్జున్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు కోసం స్థల పరిశీలన చేసిన కలెక్టర్



**పెద్దమందడి,జులై17(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టీపీఎస్) ఏర్పాటు ప్రతిపాదనలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. పాఠశాల ఆవరణలో టీపీఎస్ ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, అందుబాటులో ఉన్న స్థలం, నిర్మాణానికి అనుకూల పరిస్థితులను పరిశీలించారు.అనంతరం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి నిర్మాణానికి అవసరమైన వ్యయ అంచనాలపై సమీక్ష నిర్వహించారు. టీపీఎస్ ఏర్పాటుకు సంబంధించిన ఎస్టిమేషన్‌ను సమగ్రంగా రూపొందించి త్వరగా సమర్పించాలని ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా అక్కడే ఉన్న స్థానికులు పాఠశాల స్థలాన్ని పూర్తిస్థాయిలో సర్వే చేసి, హద్దులను గుర్తించిన తర్వాతే నిర్మాణ పనులు ప్రారంభించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.స్థలాన్ని సక్రమంగా వినియోగించేలా నిర్మాణం చేపడితే విద్యార్థులు క్రీడలు, ఇతర కార్యక్రమాల కోసం విశాలమైన మైదానం అందుబాటులో ఉంటుందని తెలిపారు.దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ పరిశీలనలో జడ్పీ సీఈఓ యాదయ్య, ఈడబ్ల్యూఐడీసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, ఇతర శాఖల అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్,గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి,సర్పంచ్ అశోక్, గ్రామ నాయకులు బాబు రెడ్డి, దిండు రవీందర్,ప్రేమ్ సాగర్, వడ్డె శేఖర్, డి ఎస్ మహేష్, మద్దూర్ వెంకటయ్య, దయ్యాల దాసు, పెద్ద శ్రీనివాస్ రెడ్డి, నాగభూషణ్, నాగార్జున్, గ్రామస్తులు పాల్గొన్నారు.





# డ్రగ్స్ నిర్మూలనపై కల్లూరు పోలీసుల ప్రత్యేక దృష్టి

- పాన్ షాపులు, కిరాణా దుకాణాలు, విద్యాసంస్థల పరిసరాల్లో ఆకస్మిక తనిఖీలు.
- సమాచారం ఇచ్చిన వారి వివరాలను రహస్యంగా ఉంచుతాం.
- ఎస్సై హరిత.

**సత్తుపల్లి, జూలై 17 (తెలంగాణ ముచ్చట్లు):** మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా కల్లూరు పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సై హరిత ఆధ్వర్యంలో శుక్రవారం పాన్ షాపులు, కిరాణా దుకాణాలు, విద్యాసంస్థల పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచి, నిషేధిత మాదకద్రవ్యాల విక్రయాలు, రవాణాపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్సై హరిత మాట్లాడుతూ, డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలు యువత జీవితాలను చిన్నాభిన్నం చేస్తాయని, వారి భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేస్తాయని అన్నారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, క్రయవిక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక బృందాలతో నిరంతర తనిఖీలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. డ్రగ్స్ లేదా గంజాయి విక్రయం, నిల్వ, రవాణా, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని, నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో ప్రజల సహకారం అత్యంత అవసరమని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి పోలీసులకు సహకరించాలని ఎస్సై హరిత పిలుపునిచ్చారు.

# వాన కోసం భక్తి జలధార.. రంగమ్మపెల్లిలో 200 మంది మహిళల నీరాభిషేకాలు



**జమ్మికుంట టౌన్ జులై 17 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం రంగమ్మపెల్లి గ్రామంలో వర్షాభావ పరిస్థితులతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో గ్రామ మహిళలు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని సుమారు 200 మంది మహిళలు ఇంటికొక బిందెడు నీటిని తీసుకుని డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా గ్రామ దేవాలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్లమ్మ తల్లి, భూలక్ష్మి, బీరన్న, పోచమ్మ, శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో గ్రామదేవతలకు నీరాభిషేకాలు చేసి భక్తి గీతాలు ఆలపిస్తూ వర్షాలు కురవాలని ప్రార్థించారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, బావులు, చెరువులు నీటితో కళకళలాడాలని, రైతుల కష్టాలు తొలగించి వానదేవుడు కరుణించాలని మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు లేక ఇప్పటికే పంటలు ఎండిపోతున్నాయని, రైతులు ఆందోళన చెందుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈసారి సమృద్ధిగా వర్షాలు కురిసి గ్రామంలో సుభిక్షం నెలకొనాలని గ్రామదేవతలను వేడుకుంటూ ఆటలు, పాటలతో భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని నిర్వహించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## ఈశ్వరమ్మ యాదవ్ అవమానంపై బీసీ జేఏసీ ఆగ్రహం



- **దూషించిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని హుజూరాబాద్‌లో ధర్నా**

**హుజూరాబాద్, జూలై 17(తెలంగాణ ముచ్చట్లు ):**యాదవ సామాజిక వర్గానికి చెందిన ఈశ్వరమ్మ యాదవ్‌ను కుల పరంగా దూషించిన వ్యక్తిపై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ హుజూరాబాద్ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. బీసీ జేఏసీ అధ్యక్షుడు సందేల వెంకన్న నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు బీసీ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్ మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా బీసీలపై సామాజిక వివక్ష, కులపరమైన అవమానాలు కొనసాగుతుండడం బాధాకరమని అన్నారు. యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పాలకవర్గ సభ్యురాలిగా నియమితులైన ఈశ్వరమ్మ యాదవ్ సన్మాన కార్యక్రమానికి సంబంధించిన ఫ్లెక్సీలో తన పేరు లేదనే కారణంతో శివచరణ్ రెడ్డి ఆమెపై దుర్భాషలాడడం తీవ్రంగా ఖండనీయమని పేర్కొన్నారు.

కులపరంగా అవమానించే వ్యాఖ్యలు సమాజంలో విద్వేషాలను రెచ్చగొడతాయని, నిందితుడిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు ఐక్యంగా ముందుకు వచ్చినప్పుడే సామాజిక న్యాయం, సమాన హక్కులు సాధ్యమవుతాయని ఆయన అన్నారు.

ఈ ధర్నాలో బీసీ జేఏసీ ప్రధాన కార్యదర్శి చిలుకమారి శ్రీనివాస్, ఉపసర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు వన్నాల శివాజీ, ఇప్పకాయల సాగర్, మావునూరి ప్రవీణ్ కుమార్, దేవసాని ప్రియదర్శిని, కొలిపాక క్రాంతి, అక్కినేపల్లి ప్రవీణ్ కుమార్, రామ్ సారయ్య, గడప రాజు, మేకల రవి, దొంత హరికిషన్, సొల్లు శంకర్, ఊదారపు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి బూత్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి: వొడితల ప్రణవ్




- **క్షేత్రస్థాయిలో సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచన**

**హుజూరాబాద్, జూలై 17(తెలంగాణ ముచ్చట్లు ):** హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఎస్ఐఆర్ (ఎస్ ఐ ఆర్ ) కోఆర్డినేటర్ల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బూత్‌లో ఓట్ల సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రతి ఓటు విలువైనదేనని అన్నారు.

బూత్ లెవల్ ఏజెంట్లతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తూ ఓటర్ల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ప్రక్రియను రాష్ట్ర పీసీసీ నిశితంగా పరిశీలిస్తోందని, ఎన్నికల కమిషన్ పొడిగించిన గడువును సద్వినియోగం చేసుకుని ఓట్ల సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని కోఆర్డినేటర్లకు పిలుపునిచ్చారు.

గ్రామాలు, వార్డుల్లో ఎదురయ్యే సమస్యలను వెంటనే నియోజకవర్గ ఇంచార్జులు, బీఎల్ఓలు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రాధాన్యంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి కార్యకర్త, బీఎల్ఏ, కోఆర్డినేటర్లు బాధ్యతగా పనిచేయాలని ప్రణవ్ కోరారు.

ఈ సమావేశంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ సదయ్య, మండల, పట్టణ అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు, కోఆర్డినేటర్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## విశ్వకర్మల సామూహిక బంద్‌కు పిలుపు




- **సమస్యల పరిష్కారం, కొత్త ధరల అమలు కోసం మూడు రోజుల ఆందోళన**

**హుజూరాబాద్, జూలై 17(తెలంగాణ ముచ్చట్లు ):** ప్రస్తుత జీవన విధానంలో నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకు పెరుగుతుండటం, కార్పొరేట్ కంపెనీల పోటీ కారణంగా విశ్వకర్మ కులవృత్తిదారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విశ్వకర్మ మనుమయ సంఘం ఆవేదన వ్యక్తం చేసింది.హుజూరాబాద్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో సంఘం పట్టణ అధ్యక్షుడు నందగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ, విశ్వకర్మల సమస్యల పరిష్కారం, సంఘ అభివృద్ధి, వృత్తి పనుల రేట్ల పెంపు కోసం ఈ నెల జూలై 18 (శనివారం) నుంచి 20 (సోమవారం) వరకు మూడు రోజుల పాటు సామూహిక బంద్ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.హుజూరాబాద్ పట్టణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు కీలక తీర్మానం చేసినట్లు తెలిపారు. బంద్ తొలి రోజు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, ఆ కమిటీ నిర్ణయించే నూతన ధరల పట్టికను అమల్లోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు.అలాగే బంద్ ముగింపు రోజైన జూలై 20న విశ్వకర్మల సమస్యలపై శాంతియుత ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. సంఘ నిర్ణయాన్ని ఉల్లంఘించి ఎవరైనా పనులు చేపడితే సంఘ పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని అధ్యక్షుడు హెచ్చరించారు.ఈ సమావేశంలో సంఘం నాయకులు రావుల వేణు, రాంపల్లి భిక్షపతి, బాణాల వివేకానంద చారి, పంచాకొత్త సత్యనారాయణ, ఎదులాపురం సదానందం, సజ్జన్నాపు రవీందర్, చల్లూరి రమేష్, ఉప్పాల ప్రసాద్ పాల్గొన్నారు.

# ప్రజల భద్రతే లక్ష్యం..
# విలాసాగర్‌లో ఏడు సీసీ కెమెరాల ఆవిష్కరణ



**జమ్మికుంట టౌన్ జూలై 17 (తెలంగాణ ముచ్చట్లు):** హుజూరాబాద్ పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని విలాసాగర్ గ్రామంలో శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన ఏడు సీసీ కెమెరాలను హుజూరాబాద్ ఏసీపీ మాధవి, జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ, ఎస్సై ఎన్. రమేష్ సంయుక్తంగా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ, నేరాల నియంత్రణ, అనుమానాస్పద కదలికల గుర్తింపు, ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణలో సీసీ కెమెరాల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. ప్రతి గ్రామం, ప్రతి వీధిలో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాలను అరికట్టడంతో పాటు విచారణను వేగవంతం చేయవచ్చని వివరించారు.

సీసీ కెమెరాలు కేవలం నేరస్థులను గుర్తించడానికే కాకుండా ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో కూడా కీలక ఆధారాలుగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామాల భద్రతలో ప్రజలు భాగస్వాములై మరిన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గ్రామంలో ఆధునిక నిఘా వ్యవస్థ ఏర్పాటుతో భద్రత మరింత బలోపేతం అవుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# మృతుడి కుటుంబానికి బీఆర్ఎస్ నేత
# కొట్టుకూరి శ్రీనివాస్ రెడ్డి ఆర్థిక సహాయం

**పెద్దమందడి,జూలై17(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం జంగమాయపల్లి గ్రామానికి చెందిన తాళ్ల సుధాకర్ గౌడ్ ఆకస్మిక మృతిపై బీఆర్ఎస్ నాయకుడు కొట్టుకూరి శ్రీనివాస్ రెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ..ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సందేశం పంపించారు.కొట్టుకూరి శ్రీనివాస్ రెడ్డి తరఫున బీఆర్ఎస్ నాయకులు మృతుడి కుటుంబానికి రూ.5,000/ వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని వారు తెలిపారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ తీరని లోటును భరించే మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి నాగరాజు, ఉప సర్పంచ్ కొండల్, మాజీ సర్పంచ్ సత్యం, శ్రీను గౌడ్, యాదగిరి, జనార్ధన్ గౌడ్, చిన్నరాజు, మేదరి శాంతన్న, కార్తిక్, బడ్డమర్రి శాంతన్న తదితరులు పాల్గొన్నారు.








# సత్తుపల్లిలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

- **ఎస్ఐఆర్‌పై శ్రేణులకు అవగాహన.**
- **కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య విమర్శలు.**

**సత్తుపల్లి, జూలై 17 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి పట్టణంలోని లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. సమావేశంలో పార్టీ శ్రేణులకు ఎస్ఐఆర్ అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఓటు చోరీపై చర్చ జరుగుతుండగా, తెలంగాణలో మాత్రం అభివృద్ధి పనుల క్రెడిట్ చోరీ జరుగుతోందని ఆరోపించారు. సీతారామ ప్రాజెక్టు రూపకల్పన, నిర్మాణం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో జరిగిందని, ఆ ప్రాజెక్టు ఘనతను కాంగ్రెస్ ప్రభుత్వం సొంతం చేసుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ప్రాజెక్టు క్రెడిట్ కోసం కాంగ్రెస్ మంత్రుల మధ్యే పోటీ నెలకొందని, ఒక మంత్రి పర్యటన గురించి మరో మంత్రికి తెలియని పరిస్థితి నెలకొనడం వారి అంతర్గత విభేదాలకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఎల్‌నీనో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నప్పటికీ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టలేదని విమర్శించారు. ప్రజల నుంచి తీవ్ర ఒత్తిడి వచ్చిన తర్వాతే సాగునీటి పంపులను ప్రారంభించారని, ప్రస్తుతం రాష్ట్రంలో పరిస్థితులు రెండో ఎండాకాలాన్ని తలపిస్తున్నాయని అన్నారు. గోదావరి జలాలను సమర్థంగా వినియోగించి రైతులకు సకాలంలో సాగునీరు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నిర్వహిస్తున్న సర్వేలన్నీ బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉన్నాయని పేర్కొన్న సండ్ర వెంకట వీరయ్య.. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో అమలైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అలాగే పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# అంబేద్కర్ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ ఎప్పుడూ?

**ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసి అక్రమ పార్కింగ్‌ను నియంత్రించాలని ప్రజల డిమాండ్**

**హుజూరాబాద్, జూలై 17(తెలంగాణ ముచ్చట్లు ):** హుజూరాబాద్ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఒకటైన అంబేద్కర్ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన సిగ్నల్స్, దిశా నిర్దేశక బోర్డులు, హెచ్చరిక సూచికలు లేకపోవడంతో వాహనదారులు, పాదచారులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉండటంతో ట్రాఫిక్ పూర్తిగా అస్తవ్యస్తంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అంబేద్కర్ చౌరస్తా మీదుగా పట్టణంలోని ప్రధాన మార్కెట్, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, వ్యాపార సముదాయాలకు వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థ లేకపోవడంతో ఐదు వైపుల నుంచి వచ్చే వాహనాలు ఒకేసారి కూడలిలోకి చేరి ట్రాఫిక్ జామ్‌కు కారణమవుతున్నాయి. దీంతో వాహనదారులు విలువైన సమయాన్ని కోల్పోవడంతో పాటు చిన్నపాటి ప్రమాదాలు జరిగే అవకాశాలు కూడా పెరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

రోడ్డు పక్కన కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. అక్రమ పార్కింగ్ కారణంగా రహదారి ఇరుకుగా మారి పెద్ద వాహనాలు, అత్యవసర సేవల వాహనాలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. పాదచారులకు సరైన మార్గం లేక రోడ్డుపైనే నడవాల్సి వస్తుండడంతో ప్రమాదాల ముప్పు పెరుగుతోంది.

ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు,m మహిళలు, వృద్ధులు రహదారి దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు నిరంతరం విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, ఆధునిక ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని, దిశా నిర్దేశక బోర్డులు, నోపార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేసి అక్రమ పార్కింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని, రద్దీ సమయాల్లో ప్రత్యేక ట్రాఫిక్ సిబ్బందిని నియమించిన ట్రాఫిక్ సిగ్నల్ తో ఎక్కువ వాహనాలు అదుపులో ఉంటాయని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి అంబేద్కర్ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



# రూ.581 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

- 89 అభివృద్ధి పనులను ప్రారంభించిన ముఖ్యమంత్రి
- లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ
- అంగన్‌వాడీ సిబ్బందికి నియామక పత్రాలు

**షామ్లీ, జూలై 17 (తెలంగాణ ముచ్చట్లు):** ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ శుక్రవారం షామ్లీ జిల్లాలో రూ.581 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టనున్న 89 అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులు జిల్లాలో మౌలిక సదుపాయాల విస్తరణతో పాటు ప్రజా సౌకర్యాల మెరుగుదలకు, ఆర్థిక కార్యకలాపాల వేగవంతానికి దోహదపడనున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పలు సంక్షేమ పథకాల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు, ప్రతీకాత్మక చెక్కులు, గృహాల తాళాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కొత్తగా ఎంపికైన అంగన్‌వాడీ కార్యకర్తలకు నియామక పత్రాలను కూడా ముఖ్యమంత్రి అందజేశారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలు అందించడంలో అంగన్‌వాడీ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు. షామ్లీ జిల్లాలో చేపడుతున్న ఈ అభివృద్ధి పనుల ద్వారా రహదారులు, ప్రజా మౌలిక సదుపాయాలు, ఇతర సేవల విస్తరణకు కొత్త ఊపు లభిస్తుందని అధికారులు వెల్లడించారు. ప్రజలకు అవసరమైన సదుపాయాలను మరింత సమర్థవంతంగా అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సంక్షేమ పథకాల అమలుపై కూడా ప్రభుత్వం సమాన దృష్టి సారిస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, ఉపాధి అవకాశాలు పెంచడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. రూ.581 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టిన ఈ 89 అభివృద్ధి ప్రాజెక్టులు షామ్లీ జిల్లా సమగ్ర అభివృద్ధికి కీలకంగా మారనున్నాయని అధికారులు తెలిపారు. మౌలిక సదుపాయాల బలోపేతంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చి ప్రజల జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



# ఆర్థిక పారదర్శకతపై ప్రత్యేక సమీక్ష

- దక్షిణ విభాగ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్థిక సలహాదారు
- నిబంధనల అమలుపై అధికారులకు సూచనలు
- పారదర్శక పరిపాలనకు ప్రాధాన్యం

**చెన్నై, జూలై 17 (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం ఆర్థిక సలహాదారు హెచ్. పి. నాయక్ శుక్రవారం చెన్నైలోని దక్షిణ విభాగ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దక్షిణ విభాగ అదనపు పోలీసు మహానిరీక్షకుడు సితాంశు శేఖర్ మిశ్రాతో సమావేశమై ఆర్థిక నిర్వహణ, పరిపాలనా అంశాలపై చర్చించారు. సందర్శనలో భాగంగా దక్షిణ విభాగ ప్రధాన కార్యాలయం, దక్షిణ మండలం-1, చెన్నై గ్రూపు ప్రధాన కార్యాలయ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఆర్థిక వ్యవహారాల్లో ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించడం, ప్రతి ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ కొనుగోలు మార్గదర్శకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ప్రజాధనాన్ని సమర్థవంతంగా, పొదుపుగా, బాధ్యతాయుతంగా వినియోగించాల్సిన అవసరాన్ని హెచ్. పి. నాయక్ వివరించారు. ప్రతి వ్యయం నిబంధనల మేరకు ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

ఆర్థిక పరిపాలనను మరింత బలోపేతం చేయడం, సంస్థాగత పారదర్శకతను పెంపొందించడం, పరిపాలనా వ్యవస్థలో అత్యున్నత ప్రమాణాలను కొనసాగించడం కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. సమర్థవంతమైన ఆర్థిక నిర్వహణ ద్వారానే ప్రజా వనరుల వినియోగంలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ఆర్థిక క్రమశిక్షణతో పాటు పరిపాలనా సామర్థ్యాన్ని పెంచేందుకు అధికారులకు నిరంతర శిక్షణ, అవగాహన కార్యక్రమాలు కూడా అవసరమని సమావేశంలో అభిప్రాయపడ్డారు. సుస్థిరమైన, జవాబుదారీతనంతో కూడిన పరిపాలనకు అన్ని స్థాయిల్లో సమన్వయం అవసరమని తెలిపారు.

ఈ సమావేశం ద్వారా కేంద్ర పారిశ్రామిక భద్రతా దళంలో ఆర్థిక పాలనను మరింత పటిష్ఠం చేయడంతో పాటు సంస్థాగత సమగ్రతను బలోపేతం చేసే దిశగా స్పష్టమైన మార్గదర్శకాలు అందించినట్లు అధికారులు తెలిపారు. ప్రజాధన పరిరక్షణ, సమర్థవంతమైన పరిపాలనలో రాజీపడబోమనే సంకల్పాన్ని మరోసారి పునరుద్ఘాటించారు.

# ప్రజా సమస్యలపై.. పార్లమెంటులో గళం విప్పుతాం

- రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి, పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి
- కొత్తగూడెం, అశ్వరావుపేట నియోజకవర్గాల్లో విస్తృత పర్యటన
- సర్ ప్రక్రియ పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచన



**ఖమ్మం బ్యూరో,జులై 17(తెలంగాణ ముచ్చట్లు ):** అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో పాటు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. అభివృద్ధి పనుల బాటలో.. ఉదయం 54వ డివిజన్‌లో మసూద్ జయంతి నళని కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ రఘురాం రెడ్డి, అనంతరం పలు ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. లక్ష్మీదేవిపల్లి మండలం అనిశెట్టిపల్లిలో నూతన సీసీ రోడ్డును ప్రారంభించారు. అలాగే, కొత్తగూడెం, సుజాతనగర్, చండ్రుగొండ, దమ్మపేట మండలాల్లో గ్రంథాలయాల ప్రహరీ, ఆధునికీకరణ, నూతన భవన నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. చండ్రుగొండలో నూతన సీసీ రోడ్డును ప్రారంభించారు. సాయంత్రం అశ్వారావుపేటలో సీనియర్ నాయకులు జేష్ట సత్యనారాయణ నివాసంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో జరిగిన ఆత్మీయ సమావేశంలో పాల్గొని దిశానిర్దేశం చేశారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం..

ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపీలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ పేదల పక్షమేనని స్పష్టం చేశారు. సన్నబియ్యం పంపిణీ, నూతన రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతుబంధు వంటి పథకాలతో ప్రజలు ఎంతో లబ్ధి పొందుతున్నారని తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు తీరని అన్యాయం జరిగిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు, సంక్షేమ ఫలాలు సక్రమంగా అందుతున్నాయని వివరించారు.

పార్లమెంట్ లో గళం విప్పుతాం..

ఈ నెల 20వ తేదీ నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయని, ఎగువ, దిగువ సభల్లో ప్రజా సమస్యలపై, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై గళం విప్పుతామని ఎంపీలు ఈ సందర్భంగా తెలిపారు.

ఓటర్ల సవరణ ప్రక్రియలో నిర్లక్ష్యం వద్దు

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ ఎంతో కీలకమని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండి తమ వివరాలను నమోదు చేయించుకోవాలని ఎంపీలు సూచించారు. కేంద్ర ప్రభుత్వం అధికారమే పరమావధిగా నిర్దాక్షిణ్యంగా ఓట్లను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఇప్పటికే పశ్చిమబెంగాల్, బీహార్ రాష్ట్రాల్లో లక్షలాది మంది ఓట్లను తొలగించిన విషయాన్ని గుర్తుచేశారు. అందుకే ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించి, ఓటర్ ఫారమ్‌లను జాగ్రత్తగా నింపి సంబంధిత అధికారులకు అందజేయాలని కోరారు. జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి జరుగుతున్న కృషిని కొనియాడుతూ, విద్యార్థుల ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాల కల్పన కోసం తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో అశ్వరావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, డీసీసీ అధ్యక్షురాలు దేవీ ప్రసన్న, పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దమ్మపేటకు సబ్ కోర్టు మంజూరు చేయాలి

- హైకోర్టు న్యాయమూర్తులకు బార్ అసోసియేషన్ వినతి.
- మౌలిక సదుపాయాల కల్పన, సిబ్బంది నియామకానికీ విజ్ఞప్తి.



**దమ్మపేట, జూలై 17 (తెలంగాణ ముచ్చట్లు):** దమ్మపేటలో నూతన సబ్‌కోర్టు ఏర్పాటు చేసి, కోర్టులో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు సిబ్బంది కొరతను తీర్చాలని దమ్మపేట బార్ అసోసియేషన్ ప్రతినిధులు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులను కోరారు. జాతీయ న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని రాష్ట్ర హైకోర్టులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోర్ట్‌ఫోలియో న్యాయమూర్తులు జస్టిస్ జె. శ్రీనివాసరావు, జస్టిస్ కె. శరత్‌లను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దమ్మపేట కోర్టులో ఎదురవుతున్న సమస్యలను న్యాయమూర్తుల దృష్టికి తీసుకెళ్లారు. పెరుగుతున్న కేసుల భారం, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దమ్మపేటలో ప్రత్యేక సబ్‌కోర్టు మంజూరు చేయాలని కోరారు. కోర్టు భవనంలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కోర్టు ఆవరణలో న్యాయదేవత విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. బార్ అసోసియేషన్ ప్రతినిధుల వినతిపై జస్టిస్ జె. శ్రీనివాసరావు సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తులను కలిసిన వారిలో దమ్మపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొంది మురళీమోహన్, ప్రధాన కార్యదర్శి లక్కినేని నరేంద్రబాబు, హైకోర్టు న్యాయవాది పెనుబల్లి రమేష్, ట్రెజరర్ తామ బాలరాజు, గేమ్స్ సెక్రటరీ తీర్నతి సంజయ్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల సంక్షేమంపై డిప్యూటీ డైరెక్టర్ ప్రత్యేక దృష్టి

- వేంసూరు ఎస్‌సీ బాలుర వసతిగృహంలో ఆకస్మిక తనిఖీ.

**వేంసూరు, జూలై 17 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన సేవలు అందేలా చూడాలనే ఉద్దేశంతో ఖమ్మం జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ శుక్రవారం వేంసూరులోని ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ బాలుర వసతిగృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా విద్యార్థుల హాజరు, వసతి గదుల నిర్వహణ, భోజన నాణ్యత, వంటశాల పరిశుభ్రత, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, స్టాక్ రిజిస్టర్లు, మెస్ రికార్డులు, సంక్షేమ పథకాల అమలును క్షుణ్ణంగా పరిశీలించారు. లోపాలు తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడిన డిప్యూటీ డైరెక్టర్, వారికి అందుతున్న భోజనం, వసతి, విద్యాభ్యాసానికి అవసరమైన సౌకర్యాలు, ఎదురవుతున్న సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, వసతిగృహంలో ఎల్లప్పుడూ పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన పోషకాహారాన్ని అందించాలని, ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వసతిగృహ సంక్షేమ అధికారి డా. తిమ్మిడి నాగరాజు వసతిగృహ నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, సంక్షేమ కార్యక్రమాల అమలు, చేపడుతున్న చర్యలను వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ప్రతి విద్యార్థికి మెరుగైన వసతి, విద్యా వాతావరణం కల్పించేందుకు శాఖ కట్టుబడి ఉందని తెలిపారు. తనిఖీలో సత్తుపల్లి అసిస్టెంట్ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం. వీరయ్య, కల్లూరు అసిస్టెంట్ బీసీ అభివృద్ధి అధికారి గ్రేసమ్మ, వేంసూరు వసతిగృహ సంక్షేమ అధికారి డా. తిమ్మిడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ఆహార భద్రతపై కాజల్ అవగాహన ప్రచారం

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ తన తాజా చిత్రం 'ది ఇండియన్ స్టోరీ' ప్రచారంలో భాగంగా ఆహార భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పురుగుమందుల అధిక వినియోగం, ఆహార కల్తీ, వాటి వల్ల ప్రజల ఆరోగ్యంపై పడుతున్న ప్రభావాన్ని ఈ చిత్రం ప్రధాన అంశంగా తీసుకురావడంతో, అదే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో కాజల్ సామాజిక మాధ్యమాల్లో ప్రచారాన్ని ప్రారంభించారు. తన భోజనానికి సంబంధించిన చిత్రాన్ని పంచుకుంటూ, మనం తినే ఆహారం నిజంగా సురక్షితమేనా అని ప్రశ్నించారు. ప్రతి ఒక్కరూ తాము తీసుకునే ఆహారం నాణ్యతపై మరింత అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచారంలో పాల్గొనాలని హీరోయిన్లు రకుల్ ప్రీత్ సింగ్, సమంతలకు కూడా సవాల్ విసిరారు.

సినిమాలో కీలక పాత్ర పోషించిన శ్రేయస్ తల్పడే కూడా ఈ ప్రచారానికి మద్దతు తెలిపారు. బాధ్యతాయుతమైన వినియోగదారులుగా మారాల్సిన అవసరం ఉందని, మనం తినే ఆహారం వెనుక ఉన్న వాస్తవాలపై చర్చ జరగాలని ఆయన పేర్కొన్నారు.

చేతన్ డీకే దర్శకత్వంలో రూపొందిన 'ది ఇండియన్ స్టోరీ' చిత్రంలో కాజల్ అగర్వాల్, శ్రేయస్ తల్పడే ప్రధాన పాత్రలు పోషించారు. జీ స్టూడియోస్, ఎమ్ఐజీ ప్రొడక్షన్ స్టూడియోస్ సమర్పణలో సాగర్ బి. షిండే నిర్మించిన ఈ చిత్రం జులై 24న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం కాజల్ ప్రారంభించిన ఈ అవగాహన ప్రచారానికి సామాజిక మాధ్యమాల్లో మంచి స్పందన లభిస్తోంది.



# సమంతకు కుటుంబ సభ్యుల సర్‌ప్రైజ్ వేడుక?

టాలీవుడ్ నటి సమంత రూత్ ప్రభు వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వార్తలు మరోసారి సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. తాజాగా ఆమె దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి ఓ కుటుంబ వివాహ వేడుకకు హాజరైనట్లు, ఆ సందర్భంగా కుటుంబ సభ్యులు, స్నేహితులు కలిసి ఆమెకు ప్రత్యేక సర్‌ప్రైజ్ వేడుక ఏర్పాటు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కథనాల ప్రకారం, ఆ వివాహ వేడుకలో సంప్రదాయ పద్ధతిలో సమంతకు కొత్త దుస్తులు అందించి, స్వీట్లు తినిపిస్తూ ఆశీర్వదించినట్లు తెలుస్తోంది. ఈ వేడుకను ముందుగా ఊహించని సమంత భావోద్వేగానికి గురై కుటుంబ సభ్యులు, స్నేహితుల ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపినట్లు ప్రచారం సాగుతోంది. రాజ్ నిడిమోరు కూడా ఈ ప్రత్యేక సందర్భంలో పాల్గొన్నట్లు సమాచారం.

వేడుకకు సంబంధించినట్లు ప్రచారంలోకి వచ్చిన చిత్రాల్లో సమంత, రాజ్ నిడిమోరు ఒకే రంగు సంప్రదాయ దుస్తుల్లో కనిపించడం అభిమానుల దృష్టిని ఆకర్షించింది. ఈ చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. అభిమానులు కూడా ఈ జంటకు శుభాకాంక్షలు తెలియజేస్తూ సందేశాలు పోస్టు చేస్తున్నారు. అయితే, సమంత వ్యక్తిగత జీవితానికి సంబంధించి ప్రచారంలో ఉన్న గర్భధారణ వార్తలపై ఆమె గానీ, ఆమె ప్రతినిధులు గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. అందువల్ల సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న ఈ వార్తలకు అధికారిక ధృవీకరణ లేదు. ఇటీవల విడుదలైన 'మా ఇంటి బంగారం' చిత్ర విజయంతో సమంత మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ప్రస్తుతం కొత్త ప్రాజెక్టుల ఎంపికలో జాగ్రత్తగా వ్యవహరిస్తున్న ఆమె కొంతకాలం విరామం తీసుకుంటున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.



# 'టాక్సిక్'లో ఛాన్స్ మిస్ చేసుకున్న స్టార్ హీరోయిన్!

'కేజీఎఫ్ 2' తర్వాత రాకింగ్ స్టార్ యశ్ నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. భారతీయ భాషలతో పాటు ఇంగ్లిష్‌లోనూ ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు.

ఈ చిత్రంలో యశ్ సరసన కియారా అద్వానీ, నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు సినిమాపై ఆసక్తిని పెంచగా, ఇందులో యాక్షన్‌తో పాటు భావోద్వేగాలకు కూడా ప్రాధాన్యం ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అన్నాచెల్లెళ్ల అనుబంధం కథలో కీలకంగా ఉండనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఇదిలా ఉండగా, ఈ చిత్రంలో నటించే అవకాశం తొలుత బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనా కపూర్‌కు వచ్చినట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే వ్యక్తిగత కారణాలతో ఆమె ఈ ప్రాజెక్ట్‌కు దూరమైనట్లు సమాచారం. అనంతరం ఆమె స్థానంలో నయనతారను ఎంపిక చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు.

కేవీఎన్ ప్రొడక్షన్స్, యశ్ మాన్‌స్టర్ మైండ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో అక్షయ్ ఒబెరాయ్, సుదేవ్ నాయర్, అమిత్ తివారీతో పాటు పలువురు అంతర్జాతీయ నటీనటులు కూడా కీలక పాత్రలు పోషిస్తున్నారు. రవి బస్రూర్, తనిష్క్ బాగ్చి, ఫహీమ్ అబ్దుల్లా సంగీతం అందిస్తుండగా, కొన్ని పాటలకు సంగీత దర్శకుడు విశాల్ స్వరాలు సమకూర్చారు. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రం విడుదల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# పర్యావరణవేత్తతో కొండా సురేఖ భేటీ

- **దుశ్చర్ల సత్యనారాయణను పరామర్శించిన మంత్రి**
- **ఆరోగ్య పరిస్థితిపై ఆరా**

**హైదరాబాద్, జూలై 17 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్ర మంత్రి కొండా సురేఖ శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ప్రముఖ పర్యావరణవేత్త, జలసాధన సమితి వ్యవస్థాపకుడు దుశ్చర్ల సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికిన మంత్రి కొండా సురేఖ కొంతసేపు పలు అంశాలపై ముచ్చటించారు. పర్యావరణ పరిరక్షణకు ఆయన అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. సమావేశంలో దుశ్చర్ల సత్యనారాయణ ఆరోగ్య పరిస్థితిని మంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం ఎలా ఉందని ఆరా తీస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణ, జల వనరుల సంరక్షణ కోసం దుశ్చర్ల సత్యనారాయణ ఎన్నో సంవత్సరాలుగా చేస్తున్న కృషిని మంత్రి అభినందించారు. ప్రకృతి పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఆయన చేపట్టిన కార్యక్రమాలు ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచాయని పేర్కొన్నారు.

జల వనరుల సంరక్షణ, పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో సమాజం మొత్తం భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా చర్చించినట్లు సమాచారం. ప్రకృతిని కాపాడే కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతను నిర్వర్తించాలని అభిప్రాయపడ్డారు. ఈ భేటీ సందర్భంగా ఇద్దరూ ఆప్యాయంగా పలకరించుకుని వివిధ సామాజిక అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించి భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరంపై కూడా చర్చించినట్లు తెలిసింది. ప్రముఖ పర్యావరణవేత్త దుశ్చర్ల సత్యనారాయణను మంత్రి కొండా సురేఖ మర్యాదపూర్వకంగా కలుసుకుని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడం పర్యావరణ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా ఆయన సేవలను మంత్రి మరోసారి ప్రశంసిస్తూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.



# గురుకుల విద్యార్థినికి ఘన సత్కారం

(మొదటి పేజీ తరువాయి)

ఆమె సాధించిన విజయం తెలంగాణకే గర్వకారణమని మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నల్గొండ జిల్లా డిండి మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన నారిమల్ల ప్రవళిక సాధారణ కుటుంబం నుంచి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణిగా ఎదిగి దేశానికి స్వర్ణ పతకాన్ని అందించడం గొప్ప విజయమని కొనియాడారు. ఆమె విజయం తెలంగాణ యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడమే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో అపారమైన ప్రతిభ దాగి ఉందనడానికి నిదర్శనమని పేర్కొన్నారు.

సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ఆధునిక క్రీడా మౌలిక సదుపాయాలు, నిపుణుల శిక్షణ, పోషకాహారం, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణమైన శిక్షణ ద్వారా విద్యార్థులను ప్రపంచస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఒలింపిక్ స్థాయి క్రీడాకారులను తయారు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, ఒలింపిక్స్‌లో పతకం సాధించే తెలంగాణ క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వంలో గ్రూప్ 1 స్థాయి ఉద్యోగం కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించడం యువ క్రీడాకారుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని అన్నారు.

ప్రవళిక ఈ స్థాయికి చేరడంలో ఆమె కోచ్ పస్పుల పరుశురాముడు, డిండి సాంఘిక సంక్షేమ గురుకుల క్రీడా అకాడమీ శిక్షక బృందం, తల్లిదండ్రుల కృషి ఎంతో కీలకమని మంత్రి అభినందించారు. ఒక క్రీడాకారుడి విజయానికి కుటుంబ సభ్యులు, కోచ్‌లు, శిక్షకుల అంకితభావం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రవళిక సాధించిన స్వర్ణ విజయం తెలంగాణ గురుకుల విద్యార్థులతో పాటు రాష్ట్ర యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని మంత్రి అన్నారు. భవిష్యత్తులో ఆసియా క్రీడలు, ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లు, కామన్వెల్త్ క్రీడలు, ఒలింపిక్స్ వంటి అత్యున్నత వేదికలపై మరిన్ని పతకాలు సాధించి భారతదేశానికి, తెలంగాణకు మరింత కీర్తి తీసుకురావాలని ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.





# దేవాదాయ శాఖలో చారిత్రక నియామకాలు

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. భక్తసేవే భగవత్సేవ అనే భావనతో ప్రతి ఉద్యోగి నిబద్ధతతో పనిచేసి భక్తులకు మరింత నాణ్యమైన సేవలు అందించాలని కోరారు. అర్చకులు, వేదపండితులు, పరిచారకులు, వాయిద్య కళాకారులు, వంట సిబ్బంది సేవలే దేవాలయాల ఆధ్యాత్మిక వైభవానికి మూలస్తంభాలని ఆమె పేర్కొన్నారు. దేవాదాయ శాఖను బలోపేతం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. ఖాళీగా ఉన్న మతపరమైన పోస్టులను భర్తీ చేయడం వల్ల నిత్యకైంకర్యాలు, వేదపారాయణాలు, ఉత్సవాలు, ధార్మిక కార్యక్రమాలు మరింత క్రమబద్ధంగా నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన దేవాలయాల్లో ప్రత్యేక సందర్భాల్లో ఆధ్యాత్మిక, ధార్మిక, పురాణ ప్రవచనాలు నిర్వహించేలా త్వరలో ఉత్తర్వులు జారీ చేస్తామని, అలాగే పనితీరు ఆధారంగా దేవాలయాల అన్ని విభాగాల ఉద్యోగులకు అవార్డులు కూడా ప్రదానం చేస్తామని ప్రకటించారు. దేవాదాయ శాఖ అధికారుల సమిష్టి కృషి ఫలితంగానే ఈ నియామకాలు సాధ్యమయ్యాయని మంత్రి కొనియాడారు. నిరంతరం దేవుని సేవలో ఉండే అర్చకులు, ఇతర ఉద్యోగుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ నిధి ట్రస్ట్ ద్వారా మరిన్ని ప్రయోజనాలు అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే గ్రేడ్ 1, గ్రేడ్ 2 కార్యనిర్వాహక అధికారుల పదోన్నతులు పూర్తిచేశామని, త్వరలో గ్రేడ్ 3 కార్యనిర్వాహక అధికారుల పదోన్నతులు కూడా చేపడతామని వెల్లడించారు.

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల్లో వరుణయాగాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో దేవాలయాల అభివృద్ధి, ధార్మిక సంప్రదాయాల పరిరక్షణ, భక్తులకు మెరుగైన సేవలందించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్, శాఖ సంచాలకుడు హనుమంతరావు, ధార్మిక సలహాదారు గోవింద హరి, దేవాలయ పరిపాలన సంస్థ సంచాలకుడు విజయ రాఘవాచార్యులు, ఇతర ఉన్నతాధికారులు, దేవాదాయ ఉద్యోగులు పాల్గొన్నారు. నియామక పత్రాలు అందుకున్న పలువురు అభ్యర్థులు ఎన్నో ఏళ్ల నిరీక్షణ తర్వాత దేవాలయ సేవ చేసే అవకాశం దక్కిందంటూ భావోద్వేగానికి గురయ్యారు.

# సిరి అతాషాకు గవర్నర్ సత్కారం

- **సాహస విజయానికి ప్రత్యేక గుర్తింపు**
- **13,800 అడుగుల ఎత్తులో ట్రెక్కింగ్ పూర్తి**
- **యువతకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్ష**

**హైదరాబాద్, జూలై 17 (తెలంగాణ ముచ్చట్లు):**

అసాధారణ సాహసస్ఫూర్తి, పట్టుదలతో విశేష ప్రతిభ కనబరిచిన హైదరాబాద్‌కు చెందిన తొమ్మిదేళ్ల బాలిక వి. సిరి అతాషాను తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్ల శుక్రవారం లోక్‌భవన్‌లో ఘనంగా సత్కరించారు. చిన్న వయసులోనే అరుదైన సాహసయాత్రలను విజయవంతంగా పూర్తి చేసి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచినందుకు ఆమెను అభినందించారు. హిమాచల్‌ప్రదేశ్‌లో నిర్వహించిన సార్‌పాస్ ట్రెక్కింగ్‌ను 13,800 అడుగుల ఎత్తులో విజయవంతంగా పూర్తి చేసి సిరి అతాషా అసాధారణ ధైర్యసాహసాలను ప్రదర్శించిందని గవర్నర్ కొనియాడారు. చిన్న వయసులోనే ఇలాంటి క్లిష్టమైన సాహసయాత్రను పూర్తి చేయడం ఆమె పట్టుదల, ఆత్మవిశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు.






ఈ సందర్భంగా సిరి అతాషా లడఖ్‌లోని ఉంలింగ్‌లా కనుమను సందర్శించిన అనుభవాలను గవర్నర్‌తో పంచుకుంది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో ఉన్న మోటారు రహదారిగా గుర్తింపు పొందిన ఈ ప్రాంతాన్ని సందర్శించడం తనకు చిరస్మరణీయ అనుభూతిని కలిగించిందని వివరించింది. సిరి అతాషా సాధించిన విజయాన్ని అభినందించిన గవర్నర్ భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలను అందుకోవాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, పట్టుదల, సాహసస్ఫూర్తితో ముందుకు సాగితే మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించగలదనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

చిన్నారులు సాహస క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవడంతో పాటు ప్రకృతిని అన్వేషించే అలవాటు అలవరచుకోవాలని గవర్నర్ సూచించారు. సిరి అతాషా వంటి ప్రతిభావంతుల విజయాలు దేశవ్యాప్తంగా యువతకు ప్రేరణగా నిలుస్తాయని, కొత్త లక్ష్యాలను చేరుకోవాలనే సంకల్పాన్ని పెంపొందిస్తాయని అన్నారు. లోక్‌భవన్‌లో జరిగిన ఈ సత్కార కార్యక్రమంలో గవర్నర్ సిరి అతాషాకు అభినందనలు తెలియజేసి ఆమె భవిష్యత్తు విజయాలకు శుభాకాంక్షలు తెలిపారు. చిన్న వయసులోనే సాధించిన ఈ అరుదైన ఘనత తెలంగాణకు గర్వకారణమని, మరెందరో యువతకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# కార్గిల్ లేక్ అభివృద్ధికి శ్రీకారం

- **బండి సంజయ్‌తో కలిసి శంకుస్థాపన**
- **రూ.1.32 కోట్లతో సుందరీకరణ పనులు**
- **అమరవీరులకు ఘన నివాళులు**

**సిరిసిల్ల, జూలై 17 (తెలంగాణ ముచ్చట్లు):**

అమృత్ 2.0 పథకం కింద రూ.1.32 కోట్ల వ్యయంతో సిరిసిల్ల పట్టణంలోని కార్గిల్ లేక్ చెరువు పునరుద్ధరణ, సుందరీకరణ పనులకు శుక్రవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న ఈ పనులతో కార్గిల్ లేక్‌కు కొత్త రూపు రానుందని అధికారులు తెలిపారు. శంకుస్థాపన అనంతరం కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన భారత సైనికులకు ఘనంగా నివాళులర్పించారు. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను ప్రతి భారతీయుడు స్మరించుకోవాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. వారి సేవలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. అమృత్ 2.0 పథకం ద్వారా పట్టణాల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు చెరువుల పునరుద్ధరణ, పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. కార్గిల్ లేక్ అభివృద్ధి పూర్తయిన తర్వాత ప్రజలకు మెరుగైన వాతావరణం, విహార సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు వివరించారు.

పనులను నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సమన్వయంతో ముందుకు సాగాలని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కార్గిల్ లేక్ సుందరీకరణతో పట్టణ సౌందర్యం మరింత పెరగడంతో పాటు పర్యాటక ఆకర్షణగా కూడా రూపుదిద్దుకుంటుందని అభిప్రాయపడ్డారు. పర్యావరణ పరిరక్షణకు దోహదపడే ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల సహకారం కూడా అవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. కార్గిల్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ వారికి ఘనంగా నివాళులర్పించారు.





తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# అటవీ అధికారులకు రాష్ట్రపతి సూచనలు

- ద్రౌపది ముర్ము కీలక సందేశం
- పర్యావరణం–ప్రజల మధ్య సమతుల్యతపై దృష్టి

**న్యూఢిల్లీ, జూలై 17 (తెలంగాణ ముచ్చట్లు):**

భారత అటవీ సేవకు చెందిన శిక్షణాధికారులు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అటవీ పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, ప్రజల భాగస్వామ్యంపై రాష్ట్రపతి వారికి పలు కీలక సూచనలు చేశారు. అడవులు, జీవవైవిధ్యాన్ని కాపాడే క్రమంలో అడవుల పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజల న్యాయమైన అవసరాలు, ఆకాంక్షలను కూడా సమానంగా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. అటవీ సంపదను పరిరక్షించే చర్యలు ప్రజల జీవనోపాధికి భంగం కలిగించకుండా ఉండాలని రాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రకృతి పరిరక్షణతో పాటు స్థానిక ప్రజల సంక్షేమాన్ని సమన్వయం చేయడం ద్వారానే స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఆమె అన్నారు. అటవీ పరిరక్షణలో ప్రజల విశ్వాసాన్ని పొందడం అత్యంత ముఖ్యమని సూచించారు.

అటవీ సంరక్షణ, అడవుల పునరుద్ధరణ, స్థిరమైన జీవనోపాధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని మరింతగా ప్రోత్సహించాలని శిక్షణాధికారులకు రాష్ట్రపతి సూచించారు. స్థానిక సమాజాలు భాగస్వాములుగా మారితే పరిరక్షణ చర్యలు మరింత విజయవంతమవుతాయని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రజల సహకారంతో చేపట్టే కార్యక్రమాలు దీర్ఘకాలిక ఫలితాలను ఇస్తాయని చెప్పారు. శాస్త్రీయ ఆధారాలతో పాటు ప్రజల అనుభవం, స్థానిక పరిజ్ఞానం, వారితో జరిగే సంభాషణల ద్వారా లభించే అవగాహనను కూడా నిర్ణయాల ప్రక్రియలో భాగం చేయాలని రాష్ట్రపతి సూచించారు. ఈ రెండింటి సమన్వయంతో తీసుకునే నిర్ణయాలు మరింత సమర్థవంతంగా ఉంటాయని ఆమె పేర్కొన్నారు. ప్రజల అనుభవాలకు కూడా తగిన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

అటవీ సేవాధికారులు దేశ ప్రకృతి సంపద పరిరక్షణలో అత్యంత కీలక బాధ్యత నిర్వహిస్తున్నారని రాష్ట్రపతి అన్నారు. వాతావరణ మార్పులు, జీవవైవిధ్య పరిరక్షణ, అటవీ విస్తరణ వంటి అంశాల్లో శాస్త్రీయ దృక్పథంతో పాటు మానవీయ కోణాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని పనిచేయాలని ఆమె సూచించారు. దేశ భవిష్యత్ అటవీ పరిరక్షణలో యువ అధికారులు కీలక పాత్ర పోషించనున్నారని రాష్ట్రపతి విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజలతో సత్సంబంధాలు పెంపొందిస్తూ, పర్యావరణ పరిరక్షణతో పాటు స్థిర



మైన అభివృద్ధి లక్ష్యాలను సాధించే దిశగా అంకితభావంతో పనిచేయాలని శిక్షణాధికారులకు ఆమె పిలుపునిచ్చారు.

# ఆరోగ్య రంగానికి భారీ ఊతం

- చండీగఢ్‌లో ఆధునిక వైద్య కేంద్రాల ప్రారంభం
- విమర్శాత్మక చికిత్స భవనానికి శంకుస్థాపన
- నాణ్యమైన వైద్యం అందరికీ లక్ష్యమన్న ప్రధాని

**చండీగఢ్, జూలై 17 (తెలంగాణ ముచ్చట్లు):**

దేశంలో నాణ్యమైన వైద్య సేవలను మరింత విస్తరించే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం చండీగఢ్‌లోని వైద్య విద్య, పరిశోధన సంస్థలో అత్యాధునిక తల్లి-శిశు వైద్య కేంద్రం, నాడీ సంబంధిత వైద్య కేంద్రాన్ని ప్రారంభించారు. అదే సందర్భంగా ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మౌలిక సదుపాయాల పథకం కింద 150 పడకల అత్యాధునిక అత్యవసర చికిత్స విభాగ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ దేశంలో ఏ పౌరుడు వైద్య సదుపాయాల



కొరత వల్ల ఇబ్బందులు పడకూడదనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం గత పన్నెండేళ్లుగా పనిచేస్తోందన్నారు. నాణ్యమైన వైద్యాన్ని అందుబాటు ఖర్చుతో ప్రజలకు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ దిశగా సాధించిన విజయాలు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు నిదర్శనమని పేర్కొన్నారు.

2014 తర్వాత దేశవ్యాప్తంగా 15 కొత్త అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థలకు ఆమోదం లభించిందని, వందలాది కొత్త వైద్య కళాశాలలు ఏర్పాటు చేశామని ప్రధానమంత్రి తెలిపారు. క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధుల చికిత్స కోసం ప్రత్యేక ఆసుపత్రులను బలోపేతం చేసినట్లు చెప్పారు. వైద్య విద్యతో పాటు ఆధునిక వైద్య సేవల విస్తరణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని వివరించారు. దేశంలో క్షయవ్యాధి నిర్మూలనలో గణనీయమైన పురోగతి సాధించామని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం క్షయవ్యాధి చికిత్స సేవల పరిధి 90 శాతాన్ని దాటిందని, గత పదేళ్లలో దేశంలో క్షయవ్యాధి ప్రబలడం 21 శాతం తగ్గినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించిందని గుర్తు చేశారు.

కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి. నడ్డా మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య విధానం-2017 సమగ్ర, సమానత్వంతో కూడిన ఆరోగ్య వ్యవస్థకు బలమైన పునాది వేసిందన్నారు. నివారణ, ప్రోత్సాహక, చికిత్స, పునరావాసం, ఉపశమన వైద్య సేవలకు సమాన ప్రాధాన్యం కల్పిస్తున్నామని తెలిపారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు దేశ ప్రజలకు ప్రాథమిక వైద్య సేవల తొలి కేంద్రాలుగా మారాయని పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ ఆరోగ్య వేదికగా వేగంగా రూపుదిద్దుకుంటోందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. డిజిటల్ సాంకేతికతతో వైద్య సేవలను ప్రజలకు మరింత సులభంగా, వేగంగా అందించే దిశగా ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొంది. దేశవ్యాప్తంగా ఆరోగ్య మౌలిక సదుపాయాల విస్తరణతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయని అధికారులు తెలిపారు.

# వినికిడితోనే విజ్ఞానం



- ప్రకృతిని ఆలకించాలనే సందేశం
- శబ్ద కాలుష్యంపై అవగాహన కల్పించే ప్రత్యేక దినం
- వినడం కూడా ఒక కళ అని గుర్తుచేసే సందర్భం

**డెస్క్, జూలై 17 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి చూడటం ఎంత ముఖ్యమో, వినడం కూడా అంతే ముఖ్యమనే సందేశాన్ని ప్రపంచ వినికిడి దినం అందిస్తోంది. ప్రతి సంవత్సరం జూలై 18న నిర్వహించే ఈ ప్రత్యేక దినోత్సవం ద్వారా ప్రకృతి, పర్యావరణం, సమాజం, మన చుట్టూ ఉన్న శబ్ద ప్రపంచాన్ని శ్రద్ధగా ఆలకించాలనే అవగాహన కల్పిస్తారు. వినికిడి అనేది కేవలం చెవులతో శబ్దాలు వినడం మాత్రమే కాకుండా, పరిసరాలను అర్థం చేసుకోవడం, ప్రకృతితో అనుబంధాన్ని పెంచుకోవడం, ఇతరుల భావాలను గౌరవించడం వంటి విలువలను పెంపొందించే ప్రక్రియగా నిపుణులు పేర్కొంటున్నారు. వేగంగా మారుతున్న ఆధునిక జీవనశైలిలో మనుషులు వినే అలవాటు కంటే మాట్లాడే అలవాటుకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుండటంతో ఈ దినోత్సవం ప్రాముఖ్యత మరింత పెరిగింది. ప్రపంచ వినికిడి దినాన్ని ప్రపంచవ్యాప్తంగా శబ్ద అధ్యయన పరిశోధకులు, పర్యావరణ సంస్థలు, విద్యాసంస్థలు, కళాకారులు, సంగీత నిపుణులు, ప్రకృతి ప్రేమికులు కలిసి నిర్వహిస్తుంటారు. ఈ దినోత్సవం వెనుక ప్రధాన ఉద్దేశం ప్రకృతిలోని శబ్దాలను గమనించడం, వాటి ద్వారా పర్యావరణ మార్పులను అర్థం చేసుకోవడం, శబ్ద కాలుష్యాన్ని తగ్గించడంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడం. పక్షుల కిలకిలారావాలు, గాలి వీచే శబ్దం, వర్షపు చినుకులు, నదుల ప్రవాహం, సముద్ర అలల గర్జన వంటి సహజ ధ్వనులు మనసుకు ప్రశాంతతను అందించడమే కాకుండా ప్రకృతి ఆరోగ్యాన్ని కూడా తెలియజేస్తాయని పరిశోధనలు సూచిస్తున్నాయి.

ప్రస్తుతం పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, వాహనాల సంఖ్య పెరగడం, భారీ యంత్రాల వినియోగం, నిర్మాణ పనులు, అధిక శబ్దంతో జరిగే వేడుకలు, వినోద కార్యక్రమాలు వంటి కారణాలతో శబ్ద కాలుష్యం రోజురోజుకు పెరుగుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల ప్రకారం నిరంతరం అధిక శబ్దాల మధ్య జీవించడం వల్ల వినికిడి సామర్థ్యం తగ్గడమే కాకుండా ఒత్తిడి, నిద్రలేమి, గుండె సంబంధిత సమస్యలు, మానసిక ఆందోళన వంటి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. అందుకే శబ్ద కాలుష్యాన్ని తగ్గించడం కూడా పర్యావరణ పరిరక్షణలో కీలక అంశంగా భావిస్తున్నారు.

ప్రకృతిలోని ప్రతి శబ్దం ఒక సందేశాన్ని అందిస్తుంది. పక్షుల కూతలు ఋతువుల మార్పులను సూచిస్తాయి. నదుల ప్రవాహం నీటి లభ్యతను తెలియజేస్తుంది. అడవుల్లో వినిపించే ధ్వనులు అక్కడి జీవ వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తాయి. సముద్ర అలల శబ్దం వాతావరణ పరిస్థితులను అంచనా వేయడానికి కొంతవరకు ఉపయోగపడుతుంది. అందుకే పర్యావరణ శాస్త్రవేత్తలు ప్రకృతి ధ్వనులను నమోదు చేసి వాటిపై పరిశోధనలు నిర్వహిస్తున్నారు. ఈ శబ్దాల ద్వారా జీవవైవిధ్యం, వాతావరణ మార్పులు, పర్యావరణ ఆరోగ్యం గురించి విలువైన సమాచారం లభిస్తోందని నిపుణులు చెబుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం విస్తరించిన నేటి కాలంలో చెవులకు ఎప్పుడూ ఇయర్‌ఫోన్లు, హెడ్‌ఫోన్లు పెట్టుకుని ఎక్కువ శబ్దంతో పాటలు వినడం యువతలో సాధారణంగా మారింది. గంటల తరబడి అధిక శబ్దంతో సంగీతం వినడం వల్ల వినికిడి నరాలు దెబ్బతినే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, యువత వినికిడి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచిస్తున్నారు. అవసరమైనప్పుడు మాత్రమే చెవిలో పెట్టుకునే పరికరాలను ఉపయోగించడం, శబ్ద స్థాయిని పరిమితంగా ఉంచడం, చెవులకు విశ్రాంతి ఇవ్వడం వంటి అలవాట్లు పెంపొందించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా అనేక దేశాల్లో ప్రకృతి నడకలు, శబ్ద అవగాహన శిబిరాలు, పర్యావరణ చర్చలు, సంగీత కార్యక్రమాలు, విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రకృతిలో కొంత సమయం గడుపుతూ అక్కడ వినిపించే సహజ ధ్వనులను గమనించే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తారు. ఈ కార్యక్రమాల ద్వారా మనిషి ప్రకృతితో మళ్లీ అనుబంధాన్ని పెంపొందించుకోవాలనే సందేశాన్ని అందిస్తున్నారు. వినడం ద్వారా నేర్చుకోవడం, అర్థం చేసుకోవడం, ప్రకృతిని గౌరవించడం అనే భావనను సమాజంలో బలపరచడమే ఈ దినోత్సవం లక్ష్యం. వినికిడి అనేది కేవలం చెవుల పనితీరు మాత్రమే కాదు, ఒక వ్యక్తిత్వ లక్షణం కూడా. ఇతరులు చెప్పేది శ్రద్ధగా వినడం వల్ల కుటుంబాల్లో, కార్యాలయాల్లో, సమాజంలో అపార్థాలు తగ్గుతాయి. పరస్పర గౌరవం పెరుగుతుంది. మంచి నాయకత్వానికి, సమర్థవంతమైన బోధనకు, విజయవంతమైన సంభాషణలకు వినే నైపుణ్యం అత్యంత అవసరమని మానసిక నిపుణులు చెబుతున్నారు. అందుకే చిన్నప్పటి నుంచే పిల్లల్లో వినే అలవాటు పెంపొందించాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణలో కూడా వినికిడి కీలక పాత్ర పోషిస్తుంది. ప్రకృతిలో సంభవించే చిన్నచిన్న మార్పులను గమనించడం ద్వారా పర్యావరణ సమస్యలను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుంది. అడవుల్లో జంతువుల కదలికలు, పక్షుల ధ్వనుల్లో మార్పులు, నీటి ప్రవాహంలో తేడాలు వంటి అంశాలు ప్రకృతి పరిస్థితులపై సంకేతాలు ఇస్తాయి. వీటిని అధ్యయనం చేయడం ద్వారా జీవవైవిధ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవచ్చు. అందుకే శబ్దాలను అధ్యయనం చేసే రంగానికి ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్యం పెరుగుతోంది. నేటి వేగవంతమైన జీవితంలో కొద్ది నిమిషాలు అయినా ప్రకృతిని ఆలకించడం, కుటుంబ సభ్యులు చెప్పేది శ్రద్ధగా వినడం, శబ్ద కాలుష్యాన్ని తగ్గించే చర్యలు తీసుకోవడం, వినికిడి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా మారింది. ప్రపంచ వినికిడి దినోత్సవం ఈ విలువలను గుర్తు చేస్తూ, ప్రకృతిమనిషి మధ్య ఉన్న అనుబంధాన్ని మరింత బలపరచే సందేశాన్ని ప్రపంచానికి అందిస్తోంది. వినడం ఒక కళ మాత్రమే కాదు, విజ్ఞానానికి, మానవ సంబంధాలకు, పర్యావరణ పరిరక్షణకు బలమైన పునాది అని ఈ ప్రత్యేక దినోత్సవం చాటి చెబుతోంది.

# వాతావరణ మార్పులు.. రైతాంగానికి కొత్త సవాళ్లు

**డెస్క్, జూలై 17 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు తీవ్రరూపం దాలుస్తున్న వేళ, వాటి ప్రభావాన్ని అత్యధికంగా ఎదుర్కొంటున్న వర్గం రైతాంగమే. ఒకప్పుడు కాలానుగుణంగా కురిసే వర్షాలు, స్థిరమైన ఉష్ణోగ్రతలు, ముందుగానే అంచనా వేయగలిగే ఋతు మార్పులు వ్యవసాయానికి కొంత భరోసాను ఇచ్చేవి. అయితే ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఎప్పుడు వర్షం పడుతుందో, ఎప్పుడు ఎండలు మండిపోతాయో, ఎప్పుడు తుఫాన్లు విరుచుకుపడతాయో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. ఈ అనిశ్చితి వ్యవసాయ రంగాన్ని తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టేస్తోంది. రైతు కష్టపడి సాగు చేసిన పంట ఒక్కరోజులోనే ప్రకృతి విపత్తుల కారణంగా నష్టపోవడం సాధారణమైపోయింది.

తెలుగు రాష్ట్రాల్లో గత కొన్నేళ్లుగా వర్షాల తీరు పూర్తిగా మారిపోయింది. కొన్ని ప్రాంతాల్లో అధిక వర్షాలు కురిసి వరదలు వస్తుండగా, మరికొన్ని ప్రాంతాల్లో వర్షాభావం కారణంగా పంటలు ఎండిపోతున్నాయి. ఒకే జిల్లాలో కూడా వర్షపాతం తీవ్రంగా మారుతుండటం రైతులకు కొత్త సమస్యలను సృష్టిస్తోంది. విత్తనాలు వేసిన వెంటనే వర్షాలు లేకపోవడం, పంట పెరుగుతున్న సమయంలో భారీ వర్షాలు కురవడం, కోత దశలో తుఫాన్లు రావడం వంటి పరిణామాలు రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. ప్రకృతి అనుకూలిస్తేనే వ్యవసాయం సాగుతుందనే పరిస్థితి మరింత స్పష్టంగా కనిపిస్తోంది. వాతావరణ మార్పుల ప్రభావం కేవలం పంట దిగుబడిపైనే కాదు, భూగర్భ జలాలపై కూడా పడుతోంది. అధిక ఉష్ణోగ్రతల కారణంగా నీటి వినియోగం పెరుగుతుండగా, వర్షాల అసమాన పంపిణీ వల్ల భూగర్భ జలాలు పునరుద్ధరించుకునే అవకాశాలు తగ్గుతున్నాయి. చెరువులు, కుంటలు, కాలువల్లో నీటి నిల్వలు తగ్గిపోవడంతో సాగునీటి కొరత మరింత పెరుగుతోంది. ఫలితంగా రైతులు బోర్లపై ఆధారపడాల్సి వస్తోంది. విద్యుత్ వ్యయం, సాగు ఖర్చులు పెరిగి వ్యవసాయం లాభసాటిగా కాకుండా భారంగా మారుతోంది.

మరోవైపు వాతావరణ మార్పుల కారణంగా పంటలకు కొత్త రకాల తెగుళ్లు, పురుగుల సమస్యలు పెరుగుతున్నాయి. గతంలో ఒక ప్రాంతానికే పరిమితమైన కొన్ని వ్యాధులు ఇప్పుడు ఇతర ప్రాంతాలకు కూడా వ్యాపిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు, తేమలో మార్పుల వల్ల పురుగుల జీవచక్రం మారి రైతులు అదనపు మందులు వాడాల్సి వస్తోంది. దీనివల్ల సాగు వ్యయం పెరగడమే కాకుండా పర్యావరణంపై కూడా ప్రతికూల ప్రభావం పడుతోంది. రైతులు శాస్త్రీయ అవగాహనతో పాటు వ్యవసాయ శాఖల సలహాలను పాటించడం గతం కంటే ఇప్పుడు మరింత అవసరమైంది.

ఈ పరిస్థితుల్లో సంప్రదాయ వ్యవసాయ విధానాలతో పాటు వాతావరణానికి అనుగుణంగా మారగల వ్యవసాయ పద్ధతులపై దృష్టి పెట్టాలి. తక్కువ నీటితో సాగయ్యే పంటలు, ఎండలను తట్టుకునే విత్తనాలు, ఆధునిక నీటి యాజమాన్య పద్ధతులు, సేంద్రీయ సాగు, సూక్ష్మ నీటిపారుదల వంటి విధానాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ప్రతి ప్రాంతానికి అనుకూలమైన పంటల ప్రణాళికను రూపొందించి రైతులకు శాస్త్రీయ మార్గదర్శకత్వం అందిస్తే నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చు. ప్రభుత్వాలు కూడా వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ విధానాలను నిరంతరం నవీకరించాలి. వాతావరణ హెచ్చరికలు గ్రామస్థాయికి వేగంగా చేరే వ్యవస్థను బలోపేతం చేయాలి. పంటల బీమా పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి నష్టపోయిన రైతులకు వేగంగా పరిహారం అందించాలి. నీటి సంరక్షణ ప్రాజెక్టులు, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి నిల్వ, భూసార పరిరక్షణ వంటి కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. వ్యవసాయ పరిశోధనా సంస్థలు వాతావరణ మార్పులకు తట్టుకునే కొత్త వంగడాలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించాలి.

రైతులు కూడా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమ వ్యవసాయ విధానాలను మార్చుకోవాల్సిన అవసరం ఉంది. ఒకే పంటపై ఆధారపడకుండా పంటల వైవిధ్యాన్ని పెంచడం, ఉద్యాన పంటలు, పశుపోషణ, చేపల పెంపకం వంటి అనుబంధ రంగాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా ఆదాయ వనరులను విస్తరించుకోవచ్చు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా మార్కెట్ సమాచారం, సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను సమర్థంగా వినియోగించుకునే అవకాశం కూడా పెరుగుతుంది. వాతావరణ మార్పులు కేవలం రైతుల సమస్య మాత్రమే కాదు, దేశ ఆహార భద్రతకు సంబంధించిన అంశం కూడా. రైతు ఉత్పత్తి తగ్గితే దాని ప్రభావం నేరుగా ఆహార ధరలపై, ద్రవ్యోల్బణంపై, ప్రజల జీవన వ్యయంపై పడుతుంది. అందువల్ల వ్యవసాయ రంగాన్ని వాతావరణ మార్పుల నుంచి రక్షించడం అంటే దేశ ఆర్థిక వ్యవస్థను, ప్రజల జీవనోపాధిని కాపాడినట్టే. ఈ విషయంలో ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు, రైతులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది.

పర్యావరణ పరిరక్షణ కూడా వాతావరణ మార్పులను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. చెట్ల పెంపకం, అటవీ సంరక్షణ, నీటి వనరుల పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, భూసారాన్ని కాపాడే వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా దీర్ఘకాలిక ప్రయోజనాలు పొందవచ్చు. అభివృద్ధి పేరుతో ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ తరాలు మరింత తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రకృతిని కాపాడటం అంటే రైతును, వ్యవసాయాన్ని, ఆహార భద్రతను కాపాడినట్టేనని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. వాతావరణ మార్పులు రైతాంగానికి విసిరిన సవాలు ఎంత పెద్దదైనా, సరైన ప్రణాళిక, శాస్త్రీయ వ్యవసాయం, ప్రభుత్వ మద్దతు, ప్రజల భాగస్వామ్యం ఉంటే దానిని అవకాశంగా కూడా మలచుకోవచ్చు. రైతు దేశానికి అన్నదాత. అతని భవిష్యత్తు సురక్షితంగా ఉంటేనే దేశ భవిష్యత్తు సురక్షితంగా ఉంటుంది. వాతావరణ మార్పులపై ఇప్పుడే సమగ్ర చర్యలు చేపట్టడం, రైతులకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక, సామాజిక భరోసా కల్పించడం కాలానుగుణ అవసరం మాత్రమే కాదు, దేశ అభివృద్ధికి అత్యంత కీలకమైన బాధ్యత కూడా.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in